
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 23,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,500 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,700 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
35.1°/21.7°
జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కలశ పూజ, ఉదయం 10 గంటలకు వరలక్ష్మీ వ్రతం ప్రారంభమవుతాయన్నారు. వ్రతంలో పాల్గొనే మహిళలు కలశం తీసుకుని రావాలని, పూజా కార్యక్రమానికి కావాల్సిన ఇతర వస్తువులు ఆలయం వారే ఉచితంగా ఇస్తారని చెప్పారు.

ఉట్లమాను ఉత్సవం..
ఈనెల 8న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఖాద్రీ ఆలయం ముందు ఉట్లమాను ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీకృష్ణుడిని దర్శించుకోవాలన్నారు.

నేడు పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

- హాజరుకానున్న ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం



పుట్టపర్తి అర్బన్: పెనుకొండ నియోజకవర్గం అభివృద్ధి సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటనలో పేర్కొన్నారు. పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అధ్యక్షతన జరిగే సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం, ఆ తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు వ్యవసాయ సలహా మండలి సమావేశం జరుగుతాయన్నారు. సమావేశాలకు ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించండి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి ప్రజలు సహకరించాలని డీఆర్‌ఓ కొండయ్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే పూర్తయిందన్నారు. ఇందులో వచ్చిన మార్పులు చేర్పులకు సంబంధించి ఓటర్లకు నోటీసులు పంపే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. తొలగించిన ఓటర్ల నుంచి సరైన ధ్రువీకరణ పత్రాలను తీసుకొని అప్‌లోడ్ చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ పరిశీలన, పునఃపరిశీలన కార్యక్రమంలో ఫారం 6,7,8 లో రిజక్ట్ చేసిన దరఖాస్తులు సుమారు 4,174 ఉన్నాయన్నారు.

హనుమాన్ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



పుట్టపర్తి టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హనుమాన్ క్షేత్రాలకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డీపీటీఓ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. మురడి, నేమకల్లు, కసాపురంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల దర్శనంలో భాగంగా ఈనెల 9న జిల్లాలోని ఆరు డిపోల నుంచి హనుమాన్ దర్శనం పేరిట ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. www.apsrtc.online.in అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్



హిందూపురం: ముద్దిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహం



పుట్టపర్తి: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి బృందం: జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను గురువారం కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలతో సందడి చేశారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. హిందూపురంలో రుక్మిణీ, సత్యభామ సహిత వేణుగోపాలస్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. పుట్టపర్తి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో ఉట్టికొట్టే కార్యక్రమం సందడిగా సాగింది.



హిందూపురం: వేణుగోపాలస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పుట్టపర్తిలో ఉట్టికొడుతున్న విద్యార్థినులు

ప్రజలకు సర్కారు రక్ష

- జిల్లాలో 16 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- అందరి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మరో వినూత్న కార్యక్రమం
- ఇంటింటికీ ఏఎన్‌ఎంలు, వలంటీర్లు
- 30 నుంచి ప్రతి మండలంలో మెగా హెల్త్ క్యాంపు
- లక్షలాదిమందికి అందనున్న వైద్యసేవలు!

ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వం ఎక్కడా వెనక్కు తగ్గడం లేదు. గ్రామీణవాసులకు పల్లెల్లోనే మెరుగైన వైద్యమందించేందుకు ఇప్పటికే అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసింది. మండలకేంద్రాల్లో అత్యాధునిక హంగులతో ఆస్పత్రులను నిర్మించి వైద్యులను అందుబాటులోకి తెచ్చింది. 'వైద్యం కోసం రోగులు రావడం కాదు.. రోగుల వద్దకే వెళ్లి వైద్యం అందించేలా' 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రవేశపెట్టింది. పెద్ద ఎత్తున 108 వాహనాలను సమకూర్చింది. సమాచారమిచ్చిన క్షణాల్లో అత్యాధునిక వైద్యం లభించే ఆస్పత్రులకు చేరేలా వసతులు సమకూర్చింది. విప్లవాత్మక చర్యలతో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేసిన సర్కారు.. ఈ క్రమంలోనే 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరున మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి జబ్బులున్న వారిని గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' తీసుకొస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ నెల 15న కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఇంటింటికీ వలంటీర్లు వెళ్లనున్నారు. ఆరోగ్య సమస్యలను ఆరా తీయనున్నారు. మరుసటి రోజు అంటే 16వ తేదీ నుంచి ఆరోగ్య సిబ్బంది కూడా వెళ్తారు. ఆయా కుటుంబాల్లోని రోగులను పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రోగులకు చికిత్స అవసరమైతే వెంటనే ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు.

30న మండలాల్లో మెగా వైద్య శిబిరం..
'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న మండలాల వారీగా మెగా వైద్య శిబిరం నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. వీరితో పాటు 104లో ఉండే డాక్టరు అందుబాటులో ఉంటారు. ఒక మండలంలో ఎన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయో ఆ పరిధిలో గుర్తించిన రోగులందరికీ ఆ రోజు వైద్య శిబిరంలో చికిత్సలు అందిస్తారు. హెల్త్ శిబిరాల నిర్వహణలో ఎంపీడీఓ, తహసీల్దార్లు మొదలు అన్ని శాఖల అధికారులు పాలుపంచుకోవాల్సి ఉంటుంది.

జిల్లా	మండలాలు	విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	కుటుంబాలు	జనాభా
అనంతపురం	31	434	7,34,691	22,41,105
శ్రీసత్యసాయి	32	378	6,10,586	18,40,043



ఆ రెండు అంశాలే కీలకం
జగనన్న సురక్ష కార్యక్రమంలో రెండు అంశాలు కీలకం కానున్నాయి. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు జబ్బులను గుర్తించడం ఒక అంశమైతే.. వారికి చికిత్స చేయించేందుకు రెఫరల్ కోసం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం రెండో అంశం.

వారిపై ప్రత్యేక దృష్టి..
మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలు, కిడ్నీ సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ నెల 15 నుంచి ఇంటింటికీ వెళ్లి వలంటీర్, ఏఎన్‌ఎం సర్వే నిర్వహిస్తారు. 30వ తేదీ నుంచి ప్రతి మండలంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో హెల్త్ క్యాంపు ఉంటుంది. ప్రతి క్యాంపులో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లతో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ సుజాత, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి

- డ్వామా పీడీ రామాంజనేయులు



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామాంజనేయులు

పుట్టపర్తి అర్బన్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని డ్వామా పీడీ రామాంజనేయులు ఆదేశించారు. గురువారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లాలో ఉపాధి హామీ కార్యాలయాల్లో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ పనులు మొదలైనప్పటి నుంచి చెబుతున్నా ఇప్పటికీ 10 వేల ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదన్నారు. వెంటనే పని పూర్తి చేయాలన్నారు. రికార్డులన్నీ పక్కాగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ శ్రీలక్ష్మి, ఏపీడీ రఘునాథరెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీబీటీ మేనేజర్ అశోక్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా 'జగనన్న ఆరోగ్య సురక్ష'



సమీక్షలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష', ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ గురువారం వర్చువల్ సమీక్షా సమావేశం నిర్వహించగా పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. సమీక్ష తర్వాత అధికారులతో డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలపై ఆరా తీసి ప్రణాళికాబద్ధంగా ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి కుటుంబంలోనూ ఒకరి సెల్‌ఫోన్‌లో సిటిజన్ యాప్ డౌన్‌లోడ్ చేయించి వారి ఆధార్ నంబర్‌కు ఈకేవైసీ చేయించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను మరింత మెరుగ్గా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా 15 నుంచి వలంటీర్, ఆశా, ఏఎన్‌ఎం తదితర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆ గ్రామంలో వైద్యాధికారులు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియజేయాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. సచివాలయ కేంద్రాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ శిబిరాలకు అందరూ వచ్చేలా చూడాలన్నారు. ఏదైనా ఎమర్జెన్సీ కేసులు ఉంటే వెంటనే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కేసులను తక్షణం ఛేదించాలి

- ఎస్పీ మాధవరెడ్డి



క్లూస్‌టీం పరికరాలు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా కేసులను తక్షణమే ఛేదించాలని క్రైమ్ స్పాట్ క్లూస్ టీం సభ్యులకు ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో క్రైమ్ స్పాట్ క్లూస్ టీం ఫింగర్ ప్రింట్ పరికరాలు, వాహనాలను ఎస్పీ పరిశీలించారు. అనంతరం జిల్లాలో ధర్మవరం, కదిరి, పుట్టపర్తి సబ్ డివిజన్లలలో ఏర్పాటు చేసిన క్రైమ్ స్పాట్ క్లూస్ టీంల పనితీరు, వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. హత్యలు, అనుమానాస్పద మృతి, దొంగతనాలు, బాంబ్ బ్లాస్టింగ్, నేరాలు జరిగినప్పుడు క్లూ టీంల పనితీరు, పరిశోధనలు, ఇప్పటి దాకా జిల్లాలో క్లూస్ టీం ద్వారా ఛేదించిన కేసుల వివరాలను టీం సభ్యులు ఎస్పీకి వివరించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్లూస్ టీంలు అప్రమత్తంగా ఉంటూ ప్రధాన సంఘటనలు జరిగిన వెంటనే అక్కడకు చేరుకొని పక్కాగా ఆధారాలు సేకరించాలన్నారు. సంబంధిత ఎస్‌ఐ, సీఐలు కూడా క్లూస్ టీం వివరాల ఆధారంగా కేసులను త్వరగా తేల్చాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీసీ సీఐ సుబ్బారావ్, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా భూహక్కు పత్రాలు

- కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమంలో సర్వే పూర్తయిన తరువాత తప్పుల్లేకుండా భూహక్కు పత్రాలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం చేపట్టిన మూడు విడతల భూ రీసర్వేను అక్టోబర్ 30 నాటికి పూర్తి చేయాలన్నారు. తప్పులు చోటు చేసుకున్న చోట మరోసారి పరిశీలించి రైతు పేరు, ఊరు, ఖాతా నంబర్‌లలో ఎలాంటి తప్పులు లేకుండా చూసి పంపిణీ చేయాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ నిర్ధీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. గతంలో అసైన్డ్ చేసిన భూమిలో లబ్ధిదారుడు ఉన్నాడా? వారసులు ఉన్నారా? వారికి ఏ సంవత్సరంలో కేటాయించారు? తదితర వివరాలను సెప్టెంబర్ 10 లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి

- జాయింట్ కలెక్టర్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో జాతీయ రహదారి విస్తరణ పనులపై ఆర్డీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అభివృద్ధికి కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై పురోగతి సాధించాలన్నారు. జిల్లాలో అత్యధికంగా రహదారి ప్రాజెక్టు పనులు జరుగుతున్నట్లు చెప్పారు. 1200 ఎకరాల భూమికి అవార్డు ప్రకటించామని, 800 ఎకరాల భూమి సేకరించడం జరిగిందన్నారు. భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆర్డీఓలను ఆదేశించారు. నేషనల్ హైవే 42, 342,716 రోడ్ల విస్తరణకు భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. ఈ రోడ్లు పూర్తయితే జి.కొత్తపల్లి–గోరంట్ల, ముదిగుబ్బ బైపాస్, కదిరి బైపాస్, కైలాపల్లి ఆర్‌ఓబీ, బెంగళూరు–కడప, హిందూపురం, పుట్టపర్తి తదితర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. ప్రైవేటు భూముల సేకరణలో సమస్యలు వస్తే సంబంధిత ఆర్డీఓలు పరిష్కరిస్తారన్నారు. రైతులకు పరిహారం అందించే దిశగా తహసీల్దార్లు కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈఈ జగదీష్, గిడ్డయ్య, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి ఆర్డీఓలు రాఘవేంద్ర, తిప్పేనాయక్, భాగ్యరేఖ సంబంధిత మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఖాతాల్లో డబ్బులు మాయం

- లోబోదిబోమంటున్న బాధితులు

పుట్టపర్తి: తమ ప్రమేయం లేకుండా తమ ఖాతాల్లో నుంచి రూ.1.20 లక్షలు డ్రా చేశారని బాధితులు లబోదిబోమంటున్నారు. ఇందులో భాగంగానే గురువారం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి గ్రామానికి చెందిన పలువురు ఖాతాదారులు స్టేట్ బ్యాంకు మేనేజర్ సుధాకర్ నాయక్ కు ఫిర్యాదు చేశారు. ఆధార్ కార్డుతో బ్యాంకుకు వెళ్లకుండా ఇంటర్‌నెట్ ద్వారా డబ్బులు డ్రా చేసుకుంటున్న క్రమంలో సుమారు 10 మందికి సంబంధించిన ఖాతాల నుంచి రూ.1.20 లక్షలు డ్రా చేసుకున్నట్లు చెప్పారు. విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని మేనేజర్ తెలిపారు.

ఆరుగురు రైల్వే ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

గుంతకల్లు: డివిజన్ పరిధిలోని వైఎస్సార్ కడప రైల్వేస్టేషన్ సమీపంలో ఎర్రముక్కపల్లి రైల్వేగేట్ సమీపంలో గూడ్స్‌రైలు మంగళవారం రాత్రి పట్టాలు తప్పిన ఘటనలో ఆరుగురు ఉద్యోగులను సస్పెన్షన్ చేస్తూ సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఆర్‌ఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో కడప స్టేషన్ మేనేజర్ డి.నరసింహారెడ్డి, డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, స్టేషన్ సూపరింటెండెంట్ లాల్‌బాబుసింగ్, సీనియర్ జీటీఎం ఖాసీమ్, పాయింట్స్ మెన్లు శాంతి, ప్రతాప్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. దీంతో పాటు వీరు కడప నుంచి వెళ్లరాదని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

'పురం' చేరిన ఏకశిల విగ్రహం రాయి



హిందూపురం శివారు ప్రాంతానికి చేరుకున్న ఏకశిల

హిందూపురం: స్థానిక సూగూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 44 అడుగుల ఎత్తుతో అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విగ్రహం తయారీకి అనువుగా ఉన్న 500 టన్నుల భారీ ఏకశిలను కర్ణాటకలోని మధుగిరి నుంచి 120 చక్రాల ప్రత్యేక లారీలో గురువారం హిందూపురం శివారుకు విగ్రహ దాత వై.చంద్రశేఖర్ తీసుకువచ్చారు. ఆలయం వద్దకు ఏకశిలను చేర్చే క్రమంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా డీఎస్పీ కంజాక్షన్ నేతృత్వంలో ప్రత్యేకంగా రూట్ మాప్ సిద్ధం చేయనున్నారు.

వృద్ధురాలి బలవన్మరణం

ఆత్మకూరు: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం గ్రామానికి చెందిన చెన్నమ్మ (65) బోన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. కుటుంబసభ్యులు ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. క్యాన్సర్ కారణంగా నొప్పి తీవ్రత భరించలేని ఆమె జీవితంపై విరక్తితో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జనార్దన తెలిపారు.

ఉచితంగా మైక్రో'సాఫ్ట్' కోర్సులు

- డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, నైపుణ్య శిక్షణతో ఉద్యోగావకాశాలు
- అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా జగన్ సర్కార్ చర్యలు
- నాస్కామ్ ఫ్యూచర్స్ స్కిల్స్ పేరిట ప్రత్యేక శిక్షణ
- దరఖాస్తు చేసుకున్న జేఎన్‌టీయూ(ఏ)లో 25 వేల మంది, ఎస్కేయూలో 15 వేల మంది



అనంతపురం: ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. డిగ్రీలో ఆనర్స్ విధానాన్ని ప్రవేశపెట్టి బీటెక్‌కు దీటుగా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగు పరిచింది. ఈ క్రమంలోనే డిగ్రీ ఆనర్స్, బీటెక్ చదివే విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు మరో అడుగు ముందుకేసింది. వేలాది రూపాయలు వెచ్చించినా అందని శిక్షణను విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందు కోసం ఐటీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా చోటు దక్కించుకున్న మైక్రోసాఫ్ట్ కంపెనీతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ కంపెనీకి సంబంధించిన అధునాతన కోర్సులపై ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణలో జిల్లాకు చెందిన 40 వేల మంది..

నిర్మాణాత్మక, వృత్తి సంబంధిత కోర్సుల్లో డిగ్రీ, బీటెక్ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకునేలా ఇంటర్న్‌షిప్, అప్రెంటైజ్‌షిప్ కు అవకాశం కల్పిస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను అభివృద్ధి చేసే క్రమంలో ఈ శిక్షణ ఉంటోంది. ఇందులో భాగంగా ఇంటర్న్‌షిప్‌ను కొనసాగించేందుకు వీలుగా ఆయా పరిశ్రమలతో కళాశాలలను అనుసంధానం చేశారు. ఇందు కోసం ఏకంగా ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్ అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 1.62 లక్షల మందికి డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనాలసిస్, నెట్‌వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సర్టిఫికేషన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణకు ఎస్కేయూ, జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోనే 40 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 25 వేల మంది, ఎస్కేయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో 15 వేల మంది విద్యార్థులు ఉండడం గమనార్హం.

వర్చువల్ విధానంలో శిక్షణ..

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) ఫ్యూచర్ స్కిల్స్ పేరిట మైక్రోసాఫ్ట్ టెక్నాలజీస్, సిస్కో, సేల్స్‌ఫోర్స్, ఏడబ్ల్యూఎస్ విభాగాల్లో వర్చువల్ విధానం కింద ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తోంది. ఐసీఐసీఐ, విప్రో, ఐబీఎం, ఎడెల్‌వీస్, హోండా, మారుతి సుజికీ వంటి కంపెనీల్లో ఫుల్‌స్టేక్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, బీఎఫ్ఎస్ఐ వంటి తదితర అంశాల్లో 'ఎంప్లాయిమెంట్ ఎక్స్‌ప్రెస్' సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఎడ్యుస్కిల్స్ ఫౌండేషన్ సంస్థతో వర్చువల్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి వీలుగా ఉన్నత విద్యామండలి ఒప్పందం కుదుర్చుకుంది.


చాలా విలువైన కోర్సు



మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్ కోర్సులు చాలా విలువైనవి. వేలాది రూపాయలు వెచ్చించినా ఇలాంటి అడ్వాన్స్‌డ్ కోర్సులు అందుబాటులోకి రావు. ఇలాంటి అమూల్యమైన కోర్సులు ఉచితంగా విద్యార్థులకు అందజేయడం గొప్ప అంశం. జేఎన్‌టీయూ (ఏ)లో ఈ కోర్సులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇప్పటికే 25 వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. దాదాపు రూ.30 కోట్లు వెచ్చించి ఇలాంటి కోర్సులు అందిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డికు అభినందనలు.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

ఇంటర్న్‌షిప్ తప్పనిసరి



నాలుగేళ్ల కాల వ్యవధితో కూడిన డిగ్రీ కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రత్యేక ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఈ క్రమంలో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశారు. ఈ మేరకు కార్యాచరణ పూర్తి చేశాం. ఏఏ కంపెనీలకు విద్యార్థులకు వెళ్లాలి అనే అంశంపై కసరత్తు పూర్తయింది. కోర్సుల్లో అభ్యసనాభవమే కాకుండా... పరిశ్రమల అనుభవం కూడా వచ్చే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవితకు దోహదపడుతాయి. – ప్రొఫెసర్ ఎం.రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

పంచాయితీలు చేస్తే కఠిన చర్యలు : డీఐజీ



సిబ్బందితో సమీక్షిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

హిందూపురం అర్బన్: పోలీస్ స్టేషన్లలో సివిల్ పంచాయితీలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని సిబ్బందిని డీఐజీ అమ్మిరెడ్డి హెచ్చరించారు. గురువారం రాత్రి హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం నేర సమీక్ష చేపట్టారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మసలుకోవాలన్నారు. వారంలో కనీసం రెండు సార్లు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు ఫిర్యాదుల కేంద్రంలో కూర్చొని తరచూ ఏ తరహా ఫిర్యాదులు అందుతున్నాయో గమనించాలన్నారు. అంతేకాక నేరుగా ఫిర్యాదులు తీసుకుని వారితో మాట్లాడడం వల్ల పోలీస్ వ్యవస్థపై సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు 'వన్ స్టిక్కర్ – వన్ లైఫ్' కార్యక్రమం చేపట్టాలన్నారు. మట్కా, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ దుప్పటి పంచాయితీల జోలికి వెళ్లరాదన్నారు. ద్విచక్ర వాహనాల చోరీల సమయంలో కేసులు కట్టడం లేదని తెలుసుకున్న ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోవాలని హితవు పలికారు. అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు విజువల్ పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కంజాక్షన్, సీఐలు శ్రీనివాసులు, ఈరన్న, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

14 మందిపై కేసు నమోదు

బత్తలపల్లి: కమ్యూనిటీ భవనం ఖాళీ చేసే విషయంలో వెంకటగారిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... టీడీపీ వర్గీయుల ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీకి చెందిన అరవిందకుమార్, వెంకటరాముడు, శ్రీనివాసులు, నాగరాజు, హరికుమార్, ప్రసాద్, నరేష్, మూర్తి, రాజాపై, అలాగే వైఎస్సార్‌సీపీ వర్గీయుల ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన బాబు, నాగభూషణ, నాగరాజు, సుకన్య, సుజాతపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కాగా, టీడీపీ వర్గీయులు ఆక్రమించుకున్న కమ్యూనిటీ హాల్‌ను ఖాళీ చేయించే విషయమై మాట్లాడుతుండగానే వారు వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడి చేసిన విషయం తెలిసిందే.

కల్లు తాగి 29 మందికి అస్వస్థత

పెనుకొండ రూరల్: కల్లు తాగి 29 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన గురువారం పెనుకొండ మండలం నాగళూరు, బండ్లపల్లి గ్రామాల్లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... నాగళూరులో ఏర్పాటు చేసిన కల్లు దుకాణంలో నాగళూరు, బండ్లపల్లి గ్రామాలకు చెందిన 45 మంది మంగళవారం కల్లు తాగారు. బుధవారం రాత్రి నుంచి కొందరికి వాంతులు, విరేచనాలయ్యాయి. దీంతో స్థానిక ఆశ కార్యకర్త వారిని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం సంజీవమ్మ, కళావతి, రామన్న, సిద్దప్ప, అంజినమ్మ, ముత్యాలమ్మ, జయమ్మ, రత్నమ్మ, కొల్లప్ప, భాస్కర్, అంజినప్ప, రమేష్, గంగరాజు తదితరులకూ వాంతులు, విరేచనాలు కావడంతో వారిని 108 అంబులెన్స్‌లో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు రామాంజనేయులును అనంతపురం తరలించారు. మరో 12 మందిని హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్ క్రాంతి తెలిపారు.



పెనుకొండ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



కల్లు దుకాణంలో నమూనాలు సేకరిస్తున్న సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్

ఘటనపై 'సెబ్' సీఐ వెంకటసుబ్బారెడ్డిని వివరణ కోరగా... కల్లు దుకాణాన్ని పరిశీలించి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

కల్లు దుకాణాన్ని పరిశీలించిన పోలీస్ అధికారులు..

కల్లు తాగి 29 మంది అస్వస్థతకు గురైన విషయం తెలియగానే సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం నాగళూరులోని కల్లు దుకాణాన్ని తనిఖీ చేశారు. నమూనాలు సేకరించిన ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. అనంతరం మరికొన్ని నమూనాలను ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో సెబ్ సీఐ వెంకటసుబ్బారెడ్డి, ఎక్సైజ్ విజిలెన్స్ సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ రమేష్ బాబు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై యువ రైతు మృతి



రంగస్వామి మృతదేహం

గుంతకల్లు రూరల్: పొలంలో పంటకు క్రిమి సంహారక మందు కొడుతూ అస్వస్థతకు గురై ఓ యువ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం గుర్రబ్బాడు గ్రామానికి చెందిన మల్లేష్, ఉమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రంగస్వామి (17) పదో తరగతి వరకూ చదువుకుని వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం తల్లిదండ్రులతో కలసి పొలానికి క్రిమి సంహారక మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. మందు పిచికారీ చేస్తుండగా విష ప్రభావంతో అస్వస్థతకు గురైన కుమారుడిని తల్లిదండ్రులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రంగస్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు.

పిల్లల ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోండి

ప్రశాంతి నిలయం: పుట్టకతో పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణపై అవగాహన పెంచుకోవాలని జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందికి డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి సూచించారు. పిల్లల్లో ఆరోగ్య సమస్యలు, నివారణ చర్యలపై పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందికి పుట్టపర్తిలోని స్త్రీశక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి హాజరై పలు అంశాలపై సూచనలిచ్చారు. అనంతరం నవజాత శిశువుల్లో ఎదుగుదలలో సమస్యలు, గ్రహణ మొర్రి, రక్త హీనత, పోషకాల లోపాలు, చర్మ, చెవి, శ్వాస కోశ వ్యాధులపై శిక్షణాధికారి డాక్టర్ ప్రేమ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ నాగరాజు, వివిధ మండలాలకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాడుగకు బత్తలపల్లి బస్‌స్టేషన్

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఆర్టీసీ డిపో పరిధిలోని నిరుపయోగంగా ఉన్న బత్తలపల్లి బస్‌స్టేషన్‌ను 15 ఏళ్ల పాటు లీజ్‌కు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ మోతీలాల్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బత్తలపల్లి బస్‌స్టేషన్‌లో ఏదైన ఆమోదయోగ్యమైన వ్యాపారాలకు ఔత్సాహికులైన వారికి టెండర్ ద్వారా అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. టెండర్లను ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు వైఎస్సార్ జిల్లా ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో దాఖలు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 99592 25859, 73828 60947, 73828 61410, 73828 60501లో సంప్రదించాలని కోరారు.

ఆదరణ.. ఇక శఠగోపమేనా..?

- ఆదరణ చిట్స్ యాజమాన్యం మొండివైఖరి
- పోలీసుల విచారణకు సహకరించని దంపతులు
- టీడీపీ నేతల అండదండలు!

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆదరణ చిట్స్ బాధితులకు ఇప్పట్లో న్యాయం జరిగే సూచనలు కనిపించడం లేదు. కోర్టులో కేసు పూర్తయితే చూద్దామంటూ బాధితులతో 'ఆదరణ చిట్స్' నిర్వాహక దంపతులు శైలజ, రామకృష్ణ బుకాయిస్తున్నట్లు తెలిసింది. ఈ వైఖరి చూస్తుంటే చిట్స్ వేసిన ఖాతాదారులను పక్కా ప్లాన్‌తోనే మోసం చేసినట్లుగా తెలుస్తోంది. బుధ, గురువారాల్లోనూ పోలీసుల విచారణకు దంపతులు సహకరించలేదని సమాచారం. మరో ఆరు రోజులు వారు పోలీసు కస్టడీలో కొనసాగాల్సి ఉంది. ఇప్పటివరకూ అనంతపురం టూటౌన్ పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు రూ. 20 కోట్లు బాధితులకు అందాల్సి ఉంది. ఇంకా 430 మందికిపైగా బాధితులు ఉన్నారు. వారి ఫిర్యాదులు కూడా అందితే ఎంత మేర మోసం చేశారన్న దానిపై స్పష్టత వస్తుందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

సొంత ఆస్తులు కూడబెట్టుకుని..

ఆదరణ చిట్స్ పేరుతో వందల మందిని మోసం చేసిన శైలజ, రామకృష్ణ దంపతులు వసూలు చేసిన కోట్లాది రూపాయలను సొంత ఆస్తులు పోగు చేసుకునేందుకు మళ్లించారు. అనంతపురంతో పాటు హంపాపురం వద్ద 130 ఎకరాల భూములు కూడబెట్టుకున్నారు. దీంతో పాటు పాలిటెక్నిక్, అగ్రికల్చర్ కళాశాలలు నాలుగు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈనాడు కార్యాలయం సమీపంలోని నాలుగు ప్లాట్‌లకు సంబంధించిన పత్రాలు, విల్లాలు ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. బంగారం, డబ్బు లేదని పేర్కొన్నట్లు సమాచారం.

అండగా టీడీపీ నేతలు!

ప్రజల సొమ్ముతో ఆస్తులు పోగేసుకుని బోర్డు తిప్పేయాలని చూసిన శైలజ, రామకృష్ణ దంపతులకు టీడీపీ నేతల అండదండలున్నట్లు తెలుస్తోంది. వారి ఒత్తిడి మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్‌ను కూడా రామకృష్ణ చెప్పినట్లుగానే నమోదు చేయాల్సి వచ్చినట్లుగా వదంతులున్నాయి. టీడీపీకి చెందిన కీలక నేతల అండదండలు ఉండటంతో ఖాతాదారులకు తిరిగి సొమ్ము చెల్లించే పరిస్థితులు లేవని స్పష్టమవుతోంది.

కూలిన చంద్రబాబు కటౌట్



టీ సర్కిల్‌లో కూలిన చంద్రబాబు కటౌట్

కళ్యాణదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ కటౌట్ కుప్పకూలింది. 'బాబు ష్యూరిటీ... భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో బుధవారం కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్‌లో చంద్రబాబు సభ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన చంద్రబాబు కటౌట్‌ను తొలగించడంలో టీడీపీ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవరించారు. గురువారం ఉదయం పట్టణ సమీపంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో వీచిన గాలులకు కటౌట్ విద్యుత్ తీగలపై పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే కరెంట్ సరఫరా నిలిపి వేశారు. విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే ప్రాణాపాయం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

మరణించినా.. ఆయన చూపు సజీవం



ఓబుళరెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: మరణించినా.. ఆయన కళ్లు సజీవంగానే ఉన్నాయి. నేత్ర దానంతో మరో ఇద్దరికి వెలుగు ప్రసాదించాయి. రెండు రోజుల క్రితం ఆత్మకూరుకు చెందిన ఓబుళరెడ్డి (35) వడ్డుపల్లి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. తన సోదరుడు సజీవంగా లేకపోయినా... ఆయన చూపు బతికే ఉండాలన్న ఆకాంక్షతో ఓబుళరెడ్డి నేత్రాలను దానం చేసేందుకు అన్న మనోహర్‌రెడ్డి సమ్మతించాడు. దీంతో గురువారం ఉదయం ఓబుళరెడ్డి మృతదేహం నుంచి నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నిపుణులు సేకరించారు. ఓబుళరెడ్డి నేత్రాలను చూపులేని మరో ఇద్దరికి ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా వైద్య నిపుణులు పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కోసం మారథాన్

అనంతపురం క్రైం: నగరంలోని ఐదు కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత తెలిపారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ కార్యాలయవర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా 17 నుంచి 25 ఏళ్ల వయసు ఉన్న యువత రణలో పాల్గొనాచ్చు.

రైలు కింద పడి వృద్ధుడి మృతి

అనంతపురం సిటీ: అనంతపురం రాంనగర్ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధుడు మరణించినట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ గురువారం తెలిపారు. మృతుడికి 70 ఏళ్ల వయసు ఉంటుందని, లేత చిలక పచ్చ రంగు షర్ట్, కాఫీ, నీలం రంగు గల గళ్ల లుంగీ ధరించి, కుడి చేతిపై తేలు బొమ్మ పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. కాగా అనంతపురం పెద్దాస్పత్రిలో చికిత్స కోసం వచ్చి, ఇలా రైలు కిందపడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు సెల్: 99088 37888/85005 38200లో సమాచారం తెలపాలని ఎస్ఐ తెలిపారు.